# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 01-10-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు అవసరమైన పాలనా వ్యవస్థను రూపొందించడంలో UPSC వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- ❖ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన భారతదేశాన్ని నిర్మించడంలోనూ విద్యార్థులే ముఖ్య పాత్ర పోషిస్తారని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు.
- ❖ దేశీయ వస్త్ర ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్రమంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు.
- ❖ ఆసియా క్రీడల్లో భారత పురుషుల క్రికెట్ జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది.

==========================

`వికసిత్ భారత్` లక్ష్య సాధనకు అవసరమైన పాలనా వ్యవస్థను రూపొందించడంలో `యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్` UPSC వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఈరోజు జరిగిన UPSC శతవార్షిక వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... UPSC 100 ఏళ్ల ప్రయాణం సంస్థపై ఉన్న నమ్మకాన్ని తెలియచేస్తోందన్నారు. 21వ శతాబ్దపు భారతదేశం ఒక కొత్త పని సంస్కృతితో ముందుకు సాగుతోందని ఆయన గుర్తు చేశారు. ప్రజలకు సేవ చేయడమే అత్యంత ముఖ్యమన్నారు. ప్రజా సేవ పట్ల ఆసక్తి ఉన్న యువతను ప్రభుత్వ సేవల్లోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన భారతదేశాన్ని నిర్మించడంలోనూ విద్యార్థులే ముఖ్య పాత్ర పోషిస్తారని కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న 'ఏక్ దిన్, ఏక్ గంటా, ఏక్ సాథ్'లో భాగంగా ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని గార్గీ కళాశాలలో నిర్వహించిన శ్రమదానం, పరిశుభ్రతా కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కేంద్రమంత్రి మాట్లాడుతూ... పరిశుభ్రతా కార్యక్రమాలకు కనీసం 30 నిమిషాలు కేటాయించాలని కోరారు. స్వచ్ఛతా ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలని సూచించారు. కేవలం విద్యా సంస్థల్లోనే కాకుండా తమ ఇళ్లలో, బహిరంగ ప్రదేశాల్లో కూడా పరిశుభ్రతను పాటించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యోగేష్ సింగ్ కూడా పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ వస్త్ర ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. న్యూఢిల్లీలో టెక్స్‌టైల్ కాన్‌క్లేవ్-2026ను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... MSMEలను బలోపేతం చేయడం దేశ వస్త్ర ఎగుమతులను పెంచడంపైన కేంద్ర ప్రభుత్వం దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. కొత్త ఎగుమతిదారులకు అవగాహన కల్పించి, ప్రోత్సహించేందుకు వివిధ దేశాల్లో ఎగుమతి సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వస్త్ర వ్యాపారాలు ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన ఇబ్బందులను కూడా ప్రభుత్వం పరిష్కరిస్తోందని చెప్పారు. టెక్స్ టైల్స్ రంగానికి మరింత రుణ లభ్యతను సులభతరం చేసేందుకు జౌళి మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం బ్యాంకర్లతో చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. దేశంలో ప్రధాన ఉపాధి కల్పన రంగాలలో వస్త్ర పరిశ్రమ ఒకటిగా నిలుస్తోందని ఆయన చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఈ రంగం కింద దాదాపు ఐదు కోట్ల మందికి ఉపాధి లభించిందని గిరిరాజ్ సింగ్ వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

క్షేత్రస్థాయిలో క్రీడా ప్రతిభను పెంపొందించేందుకు నేషనల్ స్పోర్ట్స్ రిపోజిటరీ సిస్టమ్ పోర్టల్‌లో 'శారీరక విద్యా నిపుణుల మాడ్యూల్'ను కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ ఈరోజు న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఈ పోర్టల్ శారీరక విద్యా ఉపాధ్యాయులకు సాధికారత కల్పిస్తుందని, కొత్త ఛాంపియన్‌లను తీర్చిదిద్దడంలో సహాయపడుతుందని సామాజిక మాధ్యమ పోస్టులో పేర్కొన్నారు. నిర్దిష్ట కాలపరిమితిలోగా శారీరక విద్యా ఉపాధ్యాయుల సమగ్ర, దేశవ్యాప్త రిపోజిటరీని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్థూల వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్ళు సెప్టెంబర్ నెలలో 2 లక్షల కోట్ల రూపాయలు దాటింది. అలాగే 14.7 శాతం పెరుగుదల నమోదు అయింది. గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే... ఈ ఏడాది సెప్టెంబర్‌లో మొత్తం జీఎస్‌టీ వసూళ్లు అధికమయ్యాయి. 2025 సెప్టెంబర్ లో మొత్తం స్థూల జీఎస్‌టీ ఆదాయం లక్షా 77 వేల కోట్ల రూపాయలకు పైగా ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కేంద్ర జీఎస్‌టీ (CGST) వసూళ్లు 37,772 కోట్ల రూపాయలుగా, రాష్ట్ర జీఎస్‌టీ (SGST) వసూళ్లు 45,363 కోట్ల రూపాయలుగా నమోదయ్యాయి. అలాగే, సమీకృత జీఎస్‌టీ (IGST) వసూళ్లు లక్షా 20 వేల కోట్ల రూపాయలకు పైగా ఉన్నాయి. ఈ నెలలో దేశీయ కార్యకలాపాల ద్వారా వచ్చిన స్థూల జీఎస్‌టీ ఆదాయం 10 శాతానికి పైగా పెరిగి సుమారు లక్షా 38 వేల కోట్ల రూపాయలకు చేరగా, దిగుమతులపై వసూళ్లు సుమారు 26 శాతం పెరిగి 65,525 కోట్ల రూపాయలకు చేరుకున్నాయి.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశవ్యాప్తంగా సాగుతున్న స్వచ్ఛతా కార్యక్రమంలో పలువురు కేంద్ర మంత్రులు పాల్గొంటున్నారు. న్యూఢిల్లీలోని కాళింది కుంజ్ ఘాట్ వద్ద ఈరోజు జరిగిన `శ్రమదాన్` కార్యక్రమంలో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్ విలేకరులతో మాట్లాడుతూ... పరిశుభ్రత నీటి సంరక్షణ విడదీయలేనివని అన్నారు. నదులను శుభ్రంగా ఉంచుకోవడం అత్యవసరమని చెప్పారు. నదులను

చెత్త కుండీలుగా భావించి వాటిలో వ్యర్థాలను పారవేయడం వల్ల నీరు కలుషితమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ సమాధి వద్ద జరిగిన ప్రచార కార్యక్రమంలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... పరిశుభ్రత అనేది నిరంతర కార్యక్రమం అని అన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఢిల్లీలోని పేశ్వా రోడ్ నేవ్‌యుగ్ పాఠశాలలో జరిగిన `స్వచ్ఛతా హి సేవా` కార్యక్రమంలో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్. మురుగన్ అన్నారు. న్యూఢిల్లీలోని IIMCలో `స్వచ్ఛతా హి సేవా` కార్యక్రమాలలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా ప్రజలు ఈ ఉద్యమంలో భాగమయ్యారని చెప్పారు.. అంగన్‌వాడీ కేంద్రాలు, దేవాలయాలు, విద్యా సంస్థలు ఇతర బహిరంగ ప్రదేశాలతో సహా సాధ్యమైన ప్రతి చోటా `స్వచ్ఛతా హి సేవా` ద్వారా తమవంతు కృషి చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గాంధీ జయంతి సందర్భంగా రేపు దేశవ్యాప్తంగా ప్రత్యేక గ్రామ సభలు నిర్వహించనున్నారు. పంచాయతీలను బలోపేతం చేయడం, ప్రజా సేవలను మెరుగుపరచడం, గ్రామీణ భారతదేశంలో జీవన ప్రమాణాలను పెంచడం లక్ష్యంగా ఈ సభలను జరుపుతున్నారు. ఈ ప్రత్యేక గ్రామ సభలు `ప్రజల ప్రణాళిక ప్రచారం 2026-27, `సబ్‌కీ యోజన.. సబ్ కా వికాస్` కార్యక్రమానికి కూడా నాంది పలుకుతాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ప్రచార కార్యక్రమం కింద.. గ్రామ పంచాయతీలు భాగస్వామ్య సాక్ష్యాధారిత ప్రణాళికల ద్వారా 2027-28 ఆర్థిక సంవత్సరానికి తమ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను సిద్ధం చేసుకుంటాయని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పూర్వ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ పుట్టినరోజు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు శుభాకాంక్షలు తెలిపారు. దేశాభివృద్ధి, రాజ్యాంగ విలువలు ప్రజల సంక్షేమం పట్ల మాజీ రాష్ట్రపతికి ఉన్న అచంచలమైన నిబద్ధత ఆయన సుదీర్ఘ ప్రజా జీవితంలో స్పష్టంగా కనిపిస్తుందని సామాజిక మాధ్యమం పోస్టులో ప్రధానమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అసాధారణ ధైర్యం, సమయస్ఫూర్తి ప్రదర్శించినందుకు కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రశంసించారు. విమానంలో ఉన్న ప్రతి ఒక్కరి ప్రాణాన్ని కాపాడటంలో కాక్‌పిట్‌లో కెప్టెన్ స్మిత్ మచ్చర్ చూపిన అసాధారణ ధైర్యం, సమయస్ఫూర్తి దేశానికి గర్వకారణమన్నారు. భారతీయ పైలట్లు తమ నైపుణ్యం, క్రమశిక్షణ, భద్రత పట్ల రాజీపడని నిబద్ధతతో గౌరవం సంపాదించుకున్నారని ఆయన పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆసియా క్రీడల్లో భారత పురుషుల క్రికెట్ జట్టు ఫైనల్స్‌కు చేరుకుంది. శ్రీలంకతో ఈరోజు జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 124 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు చేసిన భారత్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో శ్రీలంక బ్యాట్స్‌మెన్లు విఫలమవ్వడంతో 45 పరుగులకే ఆలౌటైంది. దీంతో శనివారం భారత్, పాకిస్థాన్‌తో గోల్డ్ మెడల్ కోసం పోటీపడనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో పురుషుల స్కిఫ్ ఈవెంట్‌లో భారత్ రజత పతకాన్ని కైవసం చేసుకుంది. పురుషుల స్కిఫ్ ఈవెంట్‌లో చైనా తర్వాతి స్థానంలో నిలిచిన మను ఫ్రాన్సిస్, ప్రిన్స్ కురిసింకల్ నోబుల్ రజత పతకాన్ని సాధించడంతో

2026 ఆసియా క్రీడల్లో భారత్ తన తొలి సెయిలింగ్ పతకాన్ని కైవసం చేసుకుంది. మరోవైపు ఆసియా క్రీడల పురుషుల హాకీ ఫైనల్ లో భారత్.. పాకిస్థాన్‌పై 4-3 తేడాతో విజయం సాధించింది. ఇదిలా ఉండగా మహిళల హాకీ జట్టు కూడా రేపు జరగబోయే ఫైనల్‌లో చైనాతో తలపడనుంది. 2026 ఆసియా క్రీడలలో ఈ రోజు దాకా భారత్ మొత్తం 66 పతకాలు సాధించింది. ఇందులో 10 స్వర్ణ పతకాలు, 23 రజత పతకాలు, 33 కాంస్య పతకాలు ఉన్నాయి.

============================

జీఎంసీ బాలయోగి జయంతి సందర్భంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈరోజు ఆయనకు నివాళి అర్పించారు. పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో ఉన్న బాలయోగి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగి పార్లమెంటరీ సంప్రదాయాలను బలోపేతం చేయడంతో పాటు.. సభా గౌరవాన్ని నిలబెట్టడంలో నిబద్ధతతో వ్యవహరించారని గుర్తు చేశారు.

============================
============================